అన్ని వర్గాలకు సీఎం జగన్ అండ

• ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఎదుట లబ్ధిదారుల హర్షం



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు అక్కమ్మ. ఈమెది బుళ్లసముద్రం గ్రామం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా రూ.4,725, రైతు భరోసా రూ.22,500, జగనన్న వసతిదీవెన రూ.20,500, వైఎస్సార్ చేయూత రూ.18,750, జగనన్న విద్యాదీవెన రూ.44,060, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ రూ.1,18,022 చొప్పున మొత్తం రూ.2,28,557 లబ్ధి పొందింది. తమ కుటుంబానికి భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్ మేలును ఎప్పటికీ మరువలేమని చెబుతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు జయమ్మ. ఈమెది బీ రాయాపురం గ్రామం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ ఆసరా రూ.16,758, వైఎస్సార్ బీమా రూ.2 లక్షలు, పింఛన్ కానుక రూ.80 వేలు, సున్నా వడ్డీ రూ.4,042, వైఎస్సార్ చేయూత రూ.37,500, రైతు భరోసా రూ.48 వేలు చొప్పున మొత్తం రూ.3,86,299 లబ్ధి పొందాం. సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటామని జయమ్మ హర్షం వ్యక్తం చేశారు. మళ్లీ సీఎంగా చేసుకుంటామన్నారు.



బీ రాయాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద వర్గాలకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారని, మళ్లీ జగనన్నకే మా మద్దతు ఉంటుందని లబ్ధిదారులు పేర్కొన్నారు. బుళ్లసముద్రం బీసీ కాలనీ, బీ రాయాపురంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికి లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను కుటుంబ సభ్యులకు అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటి వద్దకు వెళ్లినా ఎమ్మెల్యేకు ప్రజలు హారతి పట్టి తమ ఇంటికి సక్రమంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. తమ కుటుంబాలకు సీఎం జగనన్న పరిపాలనలో ఎంతో మేలు జరిగిందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. వేసవి సమీపిస్తుండడంతో గ్రామాల్లో ఎక్కడ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తన దృష్టికి తీసుకొచ్చిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, సర్పంచ్ రంగమ్మ, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు నాగరాజు, అనిత, రైతు సంఘం నాయకుడు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, మండల, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మంజునాథ్, జమ్మానిపల్లి మూర్తి, నాయకులు తిప్పేనరసప్ప, తిప్పన్న, హనుమంతరాజు, సుధాకర్, రంగస్వామి, గంగప్ప, రంగనాథ్, నాగేంద్రయాదవ్, వేణు, ఎంపీడీఓ సోనిబాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే ఆర్డీటీ లక్ష్యం



రొళ్ల : వన్నారనపల్లిలో ఇళ్లను ప్రారంభిస్తున్న స్పెయిన్ బృందం

రొళ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల అభ్యున్నతే ఆర్డీటీ లక్ష్యమని సంస్థ హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వన్నారనపల్లిలో సంస్థ ద్వారా నిర్మించిన 34 ఇళ్లను స్పెయిన్ దేశస్తులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపేదలు సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్పెయిన్ బృందం సభ్యులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్పెయిన్ బృందం సభ్యులతో పాటు ఆర్డీటీ సిబ్బందికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఎంఅండ్ఈ ఎస్టీఎల్ ప్రతాప్‌రెడ్డి, హెల్త్ ఎస్టీఎల్ భువనేశ్వరి, ఏటీఎల్ సుబ్బారావు, ఆర్డీటీ సీఓలు, సీడీసీ మెంబర్లు, ఆర్డీటీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అమరాపురం: పేద కుటుంబాలకు ఆర్డీటీ అండగా సంస్థ నిలుస్తోందని సంస్థ ఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం ఆరోనపల్లిలో ఆర్డీటీ నిర్మించిన 21 గృహాలను స్పెయిన్ దేశస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ తమ సంస్థ ఆరోనపల్లిలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి రూ.2.75 లక్షల వంతున ఆర్థిక సాయం అందించామన్నారు. ఏటీఎల్ సావిత్రి, ఆర్డీటీ సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



మాట్లాడుతున్న ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు పార్వతి, రామన్న ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ప్రగతి అధ్యక్షతన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తిరుమలమ్మ, అధ్యాపకులు శ్రీధర్, సరస్వతి, రవి నాయక్, రామన్న, నందిని, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సంస్మరణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో క్రీడాకారుల నడుమ నేతాజీ జయంతి వేడుకలను నిర్వహించి.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లిక్ దత్ కుమార్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పావగడ: నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని స్థానిక హెల్ప్ సొసైటీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మానం శశికిరణ్, సంధ్య శశికిరణ్, బేకరి నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: బుళ్లసముద్రంలో మంగళవారం ఉదయం 9 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, సర్పంచ్ రంగమ్మ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గోరంట్ల: మండలంలోని దేవులచెరువు పులగూర్లపల్లి,బుడ్డపల్లి గ్రామల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్త, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొల్ల లక్ష్మీనరసప్ప లు తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9:30 గంటలకు దేవులచెరువులో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కన్నడ పాఠశాల తనిఖీ

రొళ్ల: పిల్లిగుండ్ల గ్రామంలోని కన్నడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ మాట్లాడుతు విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో కూడిన మెనూ ప్రకారం వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న రొద్దకంపల్లి గ్రామస్తులు

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రొద్దకాంబదేవి ఆలయ గుడి గోపురం నిర్మాణానికి రొద్దకంపల్లి గ్రామస్తులు సోమవారం రూ.1,01000 విరాళం అందించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుందాం

పెనుకొండ: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిరసిస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణతో అనేక మంది కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను ఇబ్బందుల పాలు జేసే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. నాయకులు శ్రీరాములు, బయన్న పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

గోరంట్ల: మండలంలోని నార్సింపల్లి పంచాయతీ పరిధిలోని ఎర్రచెరువు, బూదిలి చెరువుల్లో చేపల పెంచుకోవడానికి పంచాయతీ అధికారులు సోమవారం వేలం వేశారు. రెండు చెరువులకు నిర్వహించిన వేలంలో పంచాయతీకి రూ.2.35 లక్షల ఆదాయం సమకూరినట్లు నార్సింపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ పేర్కొన్నారు. ఎర్రచెరువును గంగాధర్ అనే వ్యక్తి రూ.65 వేలకు వేలంలో దక్కించుకున్నారు. బూదిలి చెరువుకు సంబంధించి నార్సింపల్లికి చెందిన రాజారెడ్డి రూ.1,70,000 వేలకు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు తిప్పమ్మ, ఈఓఆర్‌డీ మహేష్ ,ఉప సర్పంచ్ నంజిరెడ్డి, బూదిలి పంచాయితీ కార్యదర్శి గంగాధర్ నాయక్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ తిమ్మారెడ్డిపల్లి శివార్లలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను సోమవారం అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివార్లలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. ఐదుగురిని అరెస్టు చేసి రూ. 7,050 నగదు , 4 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామని ఆయన తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు విరాళాలు



విరాళాలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: స్థానిక దండురోడ్డులో 27 అడుగుల ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు పలువురు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేశారు. లుమినోస్ బిల్డర్స్ అండ్ ల్యాండ్ డెవలపర్ అధినేత చౌడప్ప రూ.2,10,116, యు.వెంకటేశులు రూ.1,50,016, ఈ.నారాయణస్వామి రూ.1.01,116, సైకిల్ షాపు నాగరాజు రూ.51,116, తిప్పారెడ్డి రూ.20 వేలు, పోతప్ప రూ.20 వేలను విరాళమిచ్చారని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోనే తలమానికంగా దండురోడ్డులో 27 అడుగుల రాతి ఆంజనేయుడి విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



రోడ్డు భద్రత గురించి వివరిస్తున్న ఎంవీఐ రమణ

హిందూపురం: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమణ, శివశంకర్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం బిట్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ యువత బైక్‌లపై అతి వేగంగా వెళ్లడం, హెల్మెట్ వినియోగించకపోవడం ప్రమాదకరమన్నారు. 18 ఏళ్లు దాటిన యువత లైసెన్సు పొంది వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాణపాయం నుంచి రక్షణగా నిలుస్తాయని, వీటి పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన పెంచుకోండి

పావగడ: రోడ్డు నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పట్టణ సీఐ అజయ్ సారథి సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శనిమహాత్మ సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన రోడ్డు భద్రత సాప్తాహిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, మొబైల్ ఉపయోగించకూడదని, ఒకే బైకులో ముగ్గురు ప్రయాణించ కూడదన్నారు. ఎస్ఐ గురునాథ్, కళాశాల ప్రిన్సిపాల్ మారెప్ప, మానం శశి కిరణ్, బేకరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే లక్ష్యం

• ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



మడకశిరరూరల్: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మరో పదేళ్లు పొడిగించడమే ఇందుకు నిదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం బుళ్లసముద్రంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మరో 10 ఏళ్లు పొడిగింపుతో అయా వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ ,ఎస్టీల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు పట్ల నియోజకవర్గ ప్రజల తరపున సీఎం కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ నేత లోకేష్ యువగళం పేరుతో చేపట్టే పాదయాత్రకు ప్రజల స్పందన ఉండదన్నారు. లోకేష్‌కు నాయకుడి లక్షణాలు ఏఒక్కటీ లేవని, అలాంటి వారు పాదయాత్ర చేసినా జనం వెళ్లరన్నారు. జనం రాలేక మధ్యలోనే పాదయాత్ర నిలిపివేస్తారన్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకుల చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



మడకశిర : అలంకరణలో కన్యకాపరమేశ్వరి



అమరాపురం:హోమం నిర్వహిస్తున్న భక్తులు

మడకశిర(అగళి): అగళిలో సోమవారం వాసవీమాత కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.

మడకశిరలో...

మడకశిరలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి వివిధ పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రం మడకశిర ప్రధాన రోడ్డు పక్కన వెలసిన వాసవీ మాత ఆలయంలో సోమవారం సాయంత్రం ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహిళలు భజనలు, సంకీర్తనలు చేశారు.

పావగడ: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సోమవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు హోమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుదేశ్ కుమార్, పదాధికారులు అశోక్ కుమార్, రఘు, అశ్వర్థనారాయణ, శ్రీనాథ్, మహిళా మండలి అధ్యక్షురాలు శాంత ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: అమరాపురం, హేమావతిలో సోమవారంకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు నరసింహ భట్టాచార్యులు, హరీష్ భట్టాచార్యులు ఉదయం నుంచి గణపతి, వాస్తు హోమాలను నిర్వహించారు. మహిళా భక్తులు కలశ పూజ చేశారు.

పెనుకొండ : స్థానిక వాసవీమాత ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినం సోమవారం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, హోమాలు, అన్నసంతర్పణ చేశారు. అర్చకులు శేషాగిరి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సుధాకర్‌గుప్త, సుర్యానారాయణ, యాడికి నాగరాజు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయ రజత ద్వారం ప్రారంభం



దశావతారాల మూర్తుల రజత ద్వారాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో రంగనాథ గర్భాలయ ద్వారానికి చుట్టూ దశ అవతారాల మూర్తులతో ఏర్పాటుచేసిన రజిత ద్వారాన్ని అఖిల భారత శ్రీశైలం, కాణిపాకం క్షేత్ర నిత్యఅన్నదాన సత్రాల అధ్యక్షుడు ఒగ్గు వెంకట శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దాతృత్వానికి మారుపేరుగా నిలుస్తారని అందులో హిందూపురం వాసులు మరింత ముందుంటారన్నారు. అంతకుముందు మూలవిరాట్ వాసవీ కన్యాకపరమేశ్వరీ అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి బంగారు పట్టుచీరతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య గౌరవ అధ్యక్షుడు భూపాళం లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు జేపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు, యువజన, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆధార్ సేవలను వినియోగించుకోండి

పెనుకొండ: పట్టణంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆధార్ సెంటర్‌లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మూడో సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను కమిషనర్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఆధార్‌లో మార్పులు చేర్పులతో పాటు, నూతనంగా ఆధార్ కార్డులను పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు నందిని, సునీల్, జయశంకరరెడ్డి, ఎంపీడీఓ శివశంకరప్ప, కౌన్సిలర్లు తయాబ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

రొద్దం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ అనంతచారికి ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. అర్హులైన మహిళలకు అసైన్డ్ కమిటీ ద్వారా ప్రభుత్వం మూడెకరాల భూమి పంపిణీ చేయాలన్నారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదుల్లో ఫెయిల్ అయిన ఎస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు రఘు, శ్రీనివాసులు, అంజి పాల్గొన్నారు.

సచివాలయాల సమన్వయకర్తకు సన్మానం

రొద్దం: మండలంలోని 15 సచివాలయాలకు సమన్వయకర్తగా ఎన్నికైన ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డిని సోమవారం ఆయన నివాసంలో సన్మానించారు. రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకరనారాయణకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు చిన్నకోడిపల్లి తిమ్మారెడ్డి, అంజానరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

అమరాపురం: మండలంలో అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామని ఎంపీపీ ఈరన్న, తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయం ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, తహసీల్దార్, ఎంపీడీఓ మునిస్వామి మాట్లాడుతూ వలంటీర్ల సహకారంతో ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాల్లో తిరిగి ఇల్లు లేని వారిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

భారీఎత్తున గరుసు మట్టి తరలింపు



పెనుకొండలోకి వస్తున్న గరుసుమట్టి ట్రాక్టర్లు

పెనుకొండ: పట్టణంలోని గరుసుమట్టి భారీ ఎత్తున సరఫరా అవుతోంది. ఇస్లాపురం, కొండాపురం, కుంభకర్ణ ప్రాజెక్టు సమీపంలోని గుట్టలు, షీపారం తదితర ప్రాంతాల నుంచి కొందరు వ్యాపారులు గరుగుమట్టిని ట్రాక్టర్ల ద్వారా పట్టణానికి, ఇతర వ్యాపార సముదాయాలకు తరలిస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు గరుసు మట్టిని తరలిస్తున్నాయి. ఒక ట్రాక్టర్ గరుగు మట్టి మార్కెట్లో రూ. 1,200 పలుకుతుండడంతో వ్యాపారులకు వరంగా మారింది.

ఇష్టపడి చదవాలి

హిందూపురం: ఇష్టంతో కష్టపడి చదివితే ప్రతిఒక్కరూ ప్రతిభవంతులు కాగలరని ఇండియన్ ఫార్మసీ కౌన్సిల్ 2022 కేకే ఆచార్జీ మెమోరియల్ అవార్డు గ్రహీత హిందూపురం డీఫార్మసీ విద్యార్థి మహమ్మద్ ముస్కన్ అన్నారు. 2021–22 విద్యాసంవత్సరం పాలిటెక్నిక్ డీ ఫార్మసీలో 2,100 మార్కులకు విద్యార్థి ముస్కన్ 2017 మార్కులు సాధించింది. జాతీయస్థాయిలో మొదటిస్థానంలో నిలిచి ఇటీవల నాగపూర్‌లో కేంద్రమంత్రి నితీన్ గడ్కరీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ముస్కన్, ఆమె తల్లిదండ్రులను హిందూపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరీష్‌బాబు, అధ్యాపకులు శ్రీనివాసులు, శర్మ, సుమతి, రాజశేఖర్, ఫరూక్, సత్యకీర్తి, పాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

సోమందేపల్లి: ఓ వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన రామాంజినేయులు (చిట్టి) అనే వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

వైభవంగా కొల్లాపురమ్మ జాతర



కొల్లాపురమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: న్యాయదకుంటె గ్రామంలో కొల్లాపురమ్మ దేవి జాతర సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల సమయంలో పుణ్యక్షేత్రం నిడుగల్లు రామతీర్థంలో కొల్లాపురమ్మకు జలధి పూజలు నిర్వహించారు. కొల్లాపురమ్మ దేవిని నిడుగల్ గ్రామంలో ఊరేగించారు. తదనంతరం దేవిని న్యాయదకుంటెకు తరలించారు. సాయంత్రం భరమయ్యన పాళ్యకు చెందిన దూళప్ప కళాకారుల బృందం కోలాటం ఆడారు. రాత్రి శాంభవి మహత్మ్యం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. జేడీఎస్ కార్యాధ్యక్షుడు ఎన్ ఈరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

అమరాపురం: హలుకూరు గ్రామ పొలి మేరలో ఉన్న దొడగాటమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం చిట్నడకు గ్రామ యాదవ కులస్తులు తయారు చేయించిన ధ్వజస్తంభాన్ని అర్చకులు వేద మంత్రోచ్చారణాల మధ్య క్రేన్‌తో ప్రతిష్టాపన చేశారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

హిందూపురం టౌన్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ మాత ఆత్మార్పణం సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలోని గ్రంథాలయానికి సరస్వతి పథకం ద్వారా రూ.35 వేల విలువ చేసే 421 పాఠ్యపుస్తకాలను కళాశాల కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ సభ్యులు వాసవీ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు దాసా సందేష్, డైరెక్టర్ కట్టా అమర్, కోఆర్డినేటర్ దాసా గంగాధర్, సరస్వతీ పథకం చైర్మన్ కట్టా నాగార్జున, మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి బాలాజీ, కళాశాల కార్యదర్శి బైసాని రామ్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ నాగేంద్ర పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల: కొడగార్లగుట్ట గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన వ్యక్తి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా సెబ్ అధికారులు పట్టుకున్నట్లు సోమవారం సాయత్రం ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌లో ఉంచామన్నారు.

ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

చిలమత్తూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరతిగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రాజేంద్ర ప్రసాద్ సూచించారు.. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1,057 మందికి ఇళ్లు మంజూరు కాగా 346 మంది లబ్ధిదారులు నిర్మాణాలను పూర్తి చేసుకున్నారన్నారు. 324 ఇళ్లు నిర్మాణ దశలో ఉండగా 387 బేస్‌మెంట్ దశలో ఉన్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉగాది రోజు గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులకు బిల్లులు కూడా సకాలంలో పడుతున్నాయని, బిల్లుల విషయంలో ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆయన తెలిపారు...

టోల్‌గేట్ వద్ద మౌలిక వసతులు కల్పించాలి

లేపాక్షి: చోళసముద్రం వద్ద 544–ఈ జాతీయ రహదారిపై ఏర్పాటైన టోల్‌గేట్ వద్ద మౌలిక వసతులు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని , వెంటనే మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ బాబుకు సీపీఎం నాయకులు, లారీ డ్రైవర్లు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ టోల్ గేట్ ఏర్పాటు చేశారే కానీ అక్కడ నిబంధనల ప్రకారం ఉండాల్సిన అంబులెన్సు సౌకర్యం లేదన్నారు. మరుగుదొడ్లు లేవని, ట్రోయింగ్ వాహనం కూడా లేదన్నారు. హెల్ప్‌లైన్ సౌకర్యం కల్పించి ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.